క్లుప్తంగా

అన్నమాచార్యలో ఘనంగా మహిళా దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో అమరా హాస్పిటల్ ఎండీ డాక్టర్ జి రమాదేవి, మహిళా వర్సిటీ ప్రొఫెసర్ సీతాకుమారి, ప్రముఖ అంకాలజిస్ట్ లక్ష్మీ సంధ్య ముఖ్యఅతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. విద్యార్థినులు కష్టపడేతత్వాన్ని అలవర్చుకున్నప్పుడే ఉన్నత లక్ష్యాన్ని చేరుకుంటారని పేర్కొన్నారు. అదేవిధంగా మహిళల కోసం ఏర్పాటుచేసిన చట్టాలపై ప్రతి విద్యార్థినీ అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో దీప్తి, డాక్టర్ రమ్య, ప్రిన్సిపాల్ నాదమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలిజల అభ్యున్నతికే బలిజ సేన ఏర్పాటు



మాట్లాడుతున్న ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి కల్చరల్: రాజకీయాలకు అతీతంగా బలిజల అభ్యున్నతి కోసం బలిజ సేనను ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో బలిజసేన లోగో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కాపు, తెలగ, ఒంటరి, మున్నూరు కాపు, తూర్పు కాపు వంటి బలిజ కులాల సంక్షేమం కోసం కృషి చేస్తూ, యువతలో రాజకీయ చైతన్యాన్ని తీసుకువచ్చేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. అన్ని బలిజ సంఘాల్లోని పెద్దల సూచనలు, సలహాలు తీసుకుని భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. బలిజలకు విద్య, ఉద్యోగాల్లో సామాజిక న్యాయం చేయడంతోపాటు బలిజ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో బలిజసేన ప్రతినిధులు గోపిరాయల్, యర్రంశెట్టి మస్తాన్ రాయల్, డాక్టర్ కరుణానిధి, కె.రవి, బెల్లంకొండ సురేష్, మల్లేశ్వరరావు, గుండాల వేణురాయల్, సావిత్రి, నిర్మలాదేవి, రాజమ్మ పాల్గొన్నారు


స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న సెట్విన్ సీఈవో మురళీకృష్ణ, మబ్బు సూర్యనారాయణరెడ్డి

తిరుపతి కల్చరల్: ప్రతి మహిళా స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించి కుటుంబాలకు బాసటగా నిలవాలని సెట్విన్ సీఈవో వి.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. సెట్విన్ సహకారంతో మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు నెలలుగా మహిళలకు నిర్వహించిన ఉచిత టైలరింగ్ శిక్షణ పూర్తయింది. ఈ క్రమంలో బుధవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అలాగే ఉచిత టైలరింగ్ శిక్షణ రెండవ బ్యాచ్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ మహిళల అభ్యున్నతికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి, దివ్యాంగుల సంక్షేమానికి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ట్రస్ట్ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రస్ట్ నిర్వాహకుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ చెన్నారెడ్డి కాలనీలో తాము చేపట్టిన మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణకు విశేష స్పందన లభించిందన్నారు. మొదటి దశలో సుమారు 60 మంది మహిళలు టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకోవడం సంతోషకరమన్నారు. మహిళల కోరిక మేరకు ఉచితంగా ఆర్యవర్క్ శిక్షణను కూడా త్వరలో నిర్వహిస్తామన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్.రెడ్డి, కార్పొరేటర్ పునీత, సచివాలయం కార్యదర్శి పి.ప్రసన్నకుమారి, మహిళలు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీ వేదిక్ వర్సిటీలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య రాధా గోవింద్ త్రిపాఠి మాట్లాడుతూ ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ప్రతి వ్యక్తి ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కే హెచ్ రాజేష్, పీఆర్ఓ బ్రహ్మాచార్యులు, నీలకంఠం, భరత్ శేఖరాచార్యులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే ప్రతి కార్మికుడికీ మేలు

- యువతను ఆదరిస్తే శరవేగంగా అభివృద్ధి
- సింగపూర్‌లా చేస్తామన్న హామీలేమయ్యాయి?
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి
- ఆటో కార్మికులతో ఆత్మీయ సమావేశం



ఆటో కార్మికుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి, పక్కన ముద్రనారాయణ, ఎస్‌కె. బాబు, కోటూరు అంజనేయులు

తిరుపతి మంగళం: 'రాష్ట్రాన్ని సింగపూర్‌లా అభివృద్ధి చేస్తాం, తిరుపతిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతాం' అని చెప్పిన చంద్రబాబు మాటలు, ఇచ్చిన హామీలు ఏమయ్యాయని డిప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి నిలదీశారు. ఎన్నికల సమయంలో తమకు ఓట్లు వేస్తే అవి చేస్తాం, ఇవి చేస్తామంటూ మాయ మాటలు చెప్పే టీడీపీ, జనసేన వాళ్లని నమ్మవద్దని సూచించారు. తిరుపతి కల్యాణి రెసిడెన్సీలో బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కె.బాబు ఆధ్వర్యంలో తిరుపతి రైల్వేస్టేషన్ ట్యాక్సీ యూనియన్ నాయకులు, డ్రైవర్లు, శంకర శ్రీనివాస ఆటో యూనియన్ కార్మికులు, సురక్ష ఆసుపత్రి వద్ద ఆటో కార్మికులతో భూమన అభినయ్‌రెడ్డి ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లు మాట్లాడుతూ ఒకప్పుడు తిరుపతిలో గుంతలమయంగా ఉన్న రోడ్లపై తిరగాలంటే వాహనాలు దెబ్బనడంతో పాటు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లమని గుర్తు చేశారు. ఇప్పుడు మాస్టర్‌ప్లాన్, బీటీ రోడ్లతో ఇబ్బంది లేకుండా యాత్రికులను నిమిషాల్లోనే స్థానిక ఆలయాలకు చేరవేస్తున్నామని తెలిపారు. శ్రీవారి భక్తులు సైతం తిరుపతిలో జరిగిన అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించుకుంటామని ముక్తకంఠంతో చెప్పారు. భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న హయాంలోనే కార్మికులకు మేలు జరిగిందని గుర్తు చేశారు. రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడూ చేయని విధంగా ట్యాక్సీ, ఆటో కార్మికులకు చేయూత ఇస్తూ వారి ఖాతాల్లోకి డబ్బులు వేశారని తెలిపారు. చంద్రబాబు అబద్ధపు హామీలు ఇచ్చి మోసం చేశారని వివరించారు. రానున్న ఎన్నికల్లో కూడా టీడీపీ, జనసేన నాయకులు తమకు ఓట్లు వేయండి అవి చేస్తాం, ఇవి చేస్తామని అబద్ధాలు చెబుతారన్నారు. తిరుపతి డిప్యూటీ మేయర్‌గా ఉండి నగర అభివృద్ధికి ఎంతో కృషి చేశానని గుర్తు చేశారు. 20 ఏళ్లలో ఎవరికీ సాధ్యం కాని విధంగా అభివృద్ధిని చేసి చూపించినటుట తెలిపారు. 22 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంతో తిరుపతి నగరంలోని రహదారులు స్వర్గధామంగా మారాయని చెప్పారు. రానున్న రోజుల్లో తిరుపతిని క్రైం ఫ్రీ సిటీగా, అత్యంత పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగనన్నను మరోసారి సీఎంను చేసుకోవాలని కోరారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు కోటూరు ఆంజినేయులు, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, ట్యాక్సీ యూనియన్ నాయకులు తిరుమల రెడ్డి, పార్టీ నాయకులు తొండమనాటి వెంకటేష్ రెడ్డి, ఉదయ్‌వంశీ, పసుపులేటి సురేష్, ట్యాక్సీ, ఆటో కార్మికులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశానికి హాజరైన ఆటో కార్మికులు



క్రిస్టియన్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

అభివృద్ధికి పట్టం కట్టండి

తిరుపతి కల్చరల్: తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధి పనులను గమనించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని డెప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి కోరారు. ఆయన బుధవారం కో ఆప్షన్ సభ్యురాలు రాజేశ్వరి, తిరుపతి జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు పాల్‌రాజ్ ఆధ్వర్యంలో వెస్ట్ చర్చిలోని సమావేశ మందిరంలో క్రిస్టియన్స్ నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్మించడంతో తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టామన్నారు. రానున్న రోజుల్లో మరో 14 మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించడంతో పాటు ఆధునిక టెక్నాలజీతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేర రహిత నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తిరుపతికి ఐటీ పరిశ్రమలు తెచ్చి యువతకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తునున్నట్లు తెలిపారు. క్రిస్టియన్లకు 10 ఎకరాలలో శ్మశాన వాటిక నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పాల్‌రాజ్, కో ఆప్షన్ సభ్యురాలు రాజేశ్వరి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పాస్టర్లకు గౌరవ వేతనం అందించిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తిరుపతి నగరంలో కష్టతరమైన సందులను సైతం విశాలమైన రోడ్లతో తిరుపతి నగరాభివృద్ధికి భూమన అభినయరెడ్డి ఎంతో శ్రమించారని గుర్తు చేశారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. పాస్టర్స్ అరుల్ అరసు, జాన్సన్, దేవదానం, రాజేంద్ర, పార్టీ నేతలు శేఖర్‌రెడ్డి, మాకం చంద్ర, పడమటి కుమార్, అనిల్ రాయల్, జీవరత్నం పాల్గొన్నారు.

రేపు కపిలేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు

తిరుపతి కల్చరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కపిలేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా క్యూలైన్లు, చలువ పందిళ్లు, పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 7 నుంచి 9 గంటల వరకు రథోత్సవం, 10 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం చేపడతారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు నంది వాహనసేవ నిర్వహిస్తారు. శనివారం రాత్రి 12 నుంచి ఉదయం 4 గంటల వరకు లింగోద్భవకాల అభిషేకాలు నిర్వహిస్తారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. గృహస్తులు అప్పటికప్పుడు రూ.250లు చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కపిలేశ్వరాలయంలోని కళా వేదికపై బుధవారం రాత్రి ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వర, డోలు పాఠశాల ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన సంగీత, నృత్య సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కళాశాల గాత్ర విభాగం అధ్యాపకురాలు శైలజ శిష్య బృందంతో కలిసి పలు సంకీర్తనలను ఆలపించారు. వయోలిన్ విభాగాధిపతి కేవీ కృష్ణ ప్రదర్శించిన వాయిద్య సంగీత విన్యాసం ఆకట్టుకుంది.

పీవోఎస్ యంత్రంతో అన్నప్రసాదం టోకెన్ల జారీ



టోకెన్ల జారీని ప్రారంభిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

తిరుపతి(అలిపిరి): తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం అన్నప్రసాద వితరణ కోసం పీవోఎస్ యంత్రంతో టోకెన్ల జారీని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ప్రారంభించారు. టీటీడీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఈ యంత్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలోఎఫ్ఏసీఏవో బాలాజీ, ఐటీ జీఎం ఎల్ఎం సందీప్ పాల్గొన్నారు.

తిరుపతి ప్రజలకు అభివృద్ధి ఫలాలు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఒక్కొక్కటిగా ప్రజలకు అందుబాటులో వస్తున్నాయని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మేయర్ శిరీషతో కలిసి సప్తగిరినగర్, తాతయ్యగుంట ప్రాంతాల్లో ఇటీవల అభివృద్ధి చేసిన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగర అభివృద్ధికి రాజీలేని నిర్ణయా లు తీసుకుంటున్నామని తెలిపారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ 43వ డివిజన్‌లోని సప్తగిరి నగర్, ప్రశాంతి నగర్, యశోదానగర్‌లో రూ.77 లక్షలతో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. 11వ డివిజన్‌లోని తాతయ్యగుంటలో రూ.48 లక్షలతో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు పూర్తి చేశామని చెప్పారు. తిరుపతిలో మరిన్ని అభివృద్ధి పనులకు తమ కౌన్సిల్ శ్రీకారం చుట్టిందన్నారు. 43వ డివిజన్ కార్పొరేటర్ రాధా మురళీ యాదవ్, 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికా రెడ్డి, మునిసిపల్ ఇంజినీర్లు వెంకట్రామిరెడ్డి, చంద్రశేఖర్, డీఈలు విజయకుమార్ రెడ్డి, మహేష్, నాయకులు మురళీ యాదవ్, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, నాగిరెడ్డి, గీతా యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు

తిరుపతి తుడా: వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం 27వ డివిజన్‌కు సంబంధించి 17 మంది వార్డు వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలుందించేందుకు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను తీసుకొచ్చారని పేర్కొన్నారు. ప్రజల ఇంటి ముంగిటికే సంక్షేమ పథకాలు చేరవేస్తున్న వలంటీర్ల సేవలను గుర్తించి పురస్కారాలు అందజేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ 27వ డివిజన్ అధ్యక్షుడు చింతా భరణి యాదవ్, నాయకులు చింతా రమేష్ యాదవ్, గోపాల్ రెడ్డి, గీతా యాదవ్, సచివాలయ అడ్మిన్ సెక్రటరీ గోపాల్ కృష్ణ, పల్లవి, ఉషారాణి, రేవతి, నిరంజన్ బాబు, రెడ్డి శేఖర్, గాయత్రి పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న మేయర్ శిరీష



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

తిరుపతిలోని డాక్టర్ కిశోర్స్ రత్నం పాఠశాల 17వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. –తిరుపతి తుడా

పోటాపోటీగా టెన్నికాయిట్ పోటీలు

తిరుపతి(అలిపిరి): తిరుపతి టీటీడీ పరిపాలనా భవనం వెనుకవైపునున్న పరేడ్ గ్రౌండ్‌లో టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. బుధవారం నిర్వహించిన మహిళా సీనియర్ అధికారుల టెన్నికాయిట్ సింగిల్స్ పోటీల్లో డాక్టర్ రేణుదీక్షిత్ విజేతగా నిలవగా.. ఏపీఆర్వో పి.నీలిమ రన్నరప్‌గా నిలిచారు. మహిళా సీనియర్ అధికారుల టెన్నికాయిట్ డబుల్స్ పోటీల్లో డాక్టర్ ఎస్.కుసుమకుమారి, డాక్టర్ బి.కుసుమకుమారి జట్టు విజేతగా నిలవగా.. రమాదేవి, టి.నారాయణమ్మ జట్టు రన్నరప్‌గా నిలిచింది. 45 ఏళ్ల పైబడిన మహిళల త్రోబాల్ పోటీల్లో రాజేశ్వరి జట్టు విజయం సాధించగా, ఉషారాణి జట్టు రన్నరప్‌గా నిలిచింది. 45 ఏళ్ల లోపు మహిళల త్రోబాల్ పోటీల్లో ధనశ్రీ జట్టు విజయం సాధించగా, స్వప్నమంజరి జట్టు రన్నరప్‌గా నిలిచింది. చెస్ పోటీలు పోటాపోటీగా జరిగాయి.



చెస్ పోటీల్లో పాల్గొంటున్న టీటీడీ ఉద్యోగులు

ఘనంగా ధ్వజారోహణం



పూజలో సురేంద్రరెడ్డి దంపతులు

తిరుపతి మంగళం: జీవకోనలో వెలసిన జీవలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆలయ ధర్మకర్త సురేంద్రరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. గురువారం గణపతి, నవగ్రహ, రుద్ర హోమం, పూర్ణాహుతి, శుక్రవారం శివరాత్రి పండుగ రోజున పార్వతీ సమేత జీవలింగేశ్వరస్వామికి పంచామృత అభిషేకం, శివకోటి నామార్చన, హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలు, 9న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, స్వామివారికి అన్నాభిషేకం, అన్నదానం, లింగోద్భవకాల అభిషేకం, 10న శాంతి అభిషేకం, త్రిశూల స్నానం, ధ్వజావరోహణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సురేంద్రరెడ్డి తెలిపారు.

యూనియన్ బ్యాంకు ఉద్యోగులకు వైద్యసేవలు

తిరుపతి(అలిపిరి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల, టీహెచ్‌జీఎస్–ఐఎంఏ–డబ్ల్యూడీడబ్ల్యూ సహకారంతో స్థానిక యూనియన్ బ్యాంకు మహిళా ఉద్యోగులకు బుధవారం ఉచితంగా వైద్యసేవలు అందించారు. కార్యక్రమాన్ని యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ జి.రామ్ ప్రసాద్, మహిళా సాధికారత జోనల్ మెంబర్ ఎస్.స్వాతి, నిహిల, కె.స్వాతి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎ.చంద్రశేఖరన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, డాక్టర్లు భారతి, పార్థసారథి రెడ్డి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బరితెగింపుపై మఠం అధికారుల ఉక్కుపాదం



మఠం భూముల్లో ఆక్రమణలను కూల్చివేసిన అధికారులు



బాధితులతో మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- తుమ్మలగుంట మఠం భూముల్లో ఆక్రమణల తొలగింపు
- ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు
- ఏవో రమేష్‌నాయుడు

తిరుపతి రూరల్ / తిరుపతి కల్చరల్ : కోట్ల విలువైన హథీరాంజీ మఠం భూముల్లో బరితెగిస్తున్న భూకబ్జారాయుళ్లపై అధికారులు ఉక్కుపాదం మోపారు. నోటీసులు ఇచ్చినా పట్టించుకోకుండా తుమ్మలగుంటలోని మఠం భూముల్లో యథేచ్ఛగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను బుధవారం తెల్లవారుజామున మఠం పరిపాలనాధికారి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, మఠం అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించారు. దాదాపు 30కు పైగా అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. అక్రమ నిర్మాణాల తొలగింపును అడ్డుకునేందుకు కబ్జారాయుళ్లు ప్రయత్నించారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది.

పేదల పక్షాన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తుండటంతో స్థానికులు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వద్దకు వెళ్లి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఆయన హుటాహుటిన అక్కడకు చేరుకుని తొలగింపు పనులను అడ్డుకున్నారు. నిరుపేదలు నష్టపోతారని, కట్టడాల తొలగింపును ఆపివేయాలని మఠం, రెవెన్యూ అధికారులకు విన్నవించారు. తొలగింపు పనులు చేస్తున్న జేసీబీలకు అడ్డుగా నిలబడ్డారు. చీకటిలో తొలగింపు పనులు చేపట్టడం ఏమిటని అధికారులను నిలదీశారు. ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ అర్ధరాత్రి సమయంలో నిర్మాణ పనులు చేపడుతున్నారని, అందువల్లే తొలగింపు పనులు చీకట్లో చేయాల్సి వచ్చిందని మఠం అధికారులు స్పష్టం చేశారు. పేదలు కట్టిన కట్టడాల తొలగింపుకు మోహిత్ రెడ్డి గట్టిగా అడ్డుతగలడంతో అధికారులు వెనుదిరిగారు.

అక్రమణదారులపై క్రిమినల్ కేసులు

పేరూరు, తుమ్మలగుంట రెవెన్యూ పరిధిలో 130 ఎకరాల హథీరాంజీ మఠం భూములు ఉన్నాయని మఠం పరిపాలనాధికారి రమేష్‌నాయుడు తెలిపారు. ఆయన బుధవారం తుమ్మలగుంటలో విలేకరులతో మాట్లాడారు. కొందరు భూకబ్జారాయుళ్లు అక్రమంగా మఠం భూములను పేదలకు విక్రయించి, అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. మఠం భూములను విక్రయిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. దేవుని సేవ కోసం వినియోగించాల్సిన ఈ భూములను అమాయకులు ఎవ్వరూ కొని మోసపోవద్దని, అక్రమ నిర్మాణాలు అన్నింటినీ తొలగిస్తామని హెచ్చరించారు.

తిరుపతి ఫ్లై ఓవర్‌పై రెండు కార్ల ఢీ



దెబ్బ తిన్న కారు



బోల్తా పడిన కారు

తిరుపతి క్రైం : తిరుపతి ఫ్లైఓవర్‌పై బుధవారం రాత్రి రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ సంఘటన కలకలం రేపింది. రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొని పల్టీలు కొట్టాయి. కార్లలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.

క్లుప్తంగా

భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న శివ భక్త బృందం సభ్యులు

చంద్రగిరి: స్థానిక జమండ్లవీధిలోని సీతారామాలయం వద్ద శివస్వామి భక్త బృందం బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శివ దీక్ష చేపట్టిన భక్తులు శ్రీశైలం యాత్రకు పయనమయ్యారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయం వద్ద ఆంజనేయ స్వామి భారీ విగ్రహానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుమారు 500 మందికి అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఏటా శివ దీక్షను చేపట్టి శ్రీశైలం యాత్రకు బయలుదేరేముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

కనుల పండువగా అగస్త్యేశ్వర స్వామి రథోత్సవం



రథంపై ఆనందవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి

చంద్రగిరి: మండల పరిధిలోని స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం పార్వతీ పరమేశ్వరులు రథంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అంతకముందు తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం మూలమూర్తికి విభూది అభిషేకం నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి ఉదయం రథోత్సవం చేపట్టారు. స్వామి, అమ్మవార్లు రథంపై కొలువై భక్తులను అనుగ్రహించారు. రాత్రి కామధేను వాహనంపై ఊరేగారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రేపు కపిలేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు

తిరుపతి కల్చరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కపిలేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా క్యూలైన్లు, చలువ పందిళ్లు, పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 7 నుంచి 9 గంటల వరకు రథోత్సవం, 10 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం చేపడతారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు నంది వాహనసేవ నిర్వహిస్తారు. శనివారం రాత్రి 12 నుంచి ఉదయం 4 గంటల వరకు లింగోద్భవకాల అభిషేకాలు నిర్వహిస్తారు. అదేవిధంగా శనివారం శివ పార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. గృహస్తులు రూ.250లు చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కపిలేశ్వరాలయంలోని కళా వేదికపై బుధవారం రాత్రి ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వర, డోలు పాఠశాల ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గాత్ర విభాగం అధ్యాపకురాలు శైలజ శిష్య బృందంతో కలిసి పలు సంకీర్తనలను ఆలపించారు. వయోలిన్ విభాగాధిపతి కేవీ కృష్ణ ప్రదర్శించిన వాయిద్య సంగీత విన్యాసం ఆకట్టుకుంది.

హోరెత్తిన అభిమానం





చిగురువాడలో మహిళలకు చెక్కు ఇస్తున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి, వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఉపసర్పంచ్ మోహనరామిరెడ్డి

- అవిలాల, చిగురువాడలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఘన స్వాగతం
- చిగురువాడలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ
- పాటల సీడీ విడుదల

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబంపై అభిమానం హోరెత్తుతోంది. తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం మండలాల్లో బుధవారం ఆయన కుటుంబ సభ్యులు చేసిన గడప గడపకూ పాదయాత్రకు స్థానికుల నుంచి విశేష ఆదరణ లభించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం బుధవారం తిరుపతి రూరల్ మండలం చిగురువాడ, అవిలాల పంచాయతీల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా చిగురువాడ పంచాయతీలోని వైఎస్సార్ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి వందలాది బైక్‌లతో ర్యాలీగా వెళ్లి చిగురువాడలో సర్పంచ్ ముచ్చెలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వందలాది కోట్లతో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. జెండా ఆవిష్కరించారు. మహిళలకు రూ.3.22 కోట్ల ఆసరా చెక్కులను అందించారు. అనంతరం అవిలాల పంచాయతీలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు అవిలాల లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ సీవీ రమణ అధ్యక్షతన జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో పాల్గొన్నారు. అవిలాల పంచాయతీలో వందలాది మంది యువత, మహిళలు ఆయనకు పూలవర్షం కురిపిస్తూ అపూర్వ స్వాగతం పలికారు.

పాటల సీడీ ఆవిష్కరణ

మన ఊరు.. మన మోహిత్ పేరుతో అవిలాల ఎంపీటీసీ హరికృష్ణారెడ్డి రూపొందించిన పాటల సీడీని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆవిష్కరించారు. పాటలు అద్భుతంగా వచ్చాయని హరికృష్ణారెడ్డిని అభినందించారు. ప్రజలకు చేరువ కావడానికి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలోచింపచేసే పాటలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, చిగురువాడ, అవిలాల పంచాయతీ సర్పంచ్‌లు ప్రదీప్ రెడ్డి, వెంకటరమణ, మాజీ సర్పంచ్ వేమూరి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ కవిత సుధాకర్ రెడ్డి, పార్టీ డివిజనల్ అధ్యక్షులు లోకనాథరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చిగురువాడ ఉప సర్పంచ్ మోహన్‌రామి రెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు ధరణి కుమార్ రెడ్డి, బాలకృష్ణ, కుద్రకాల్వ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



భోజనాలు వడ్డిస్తున్న మోహిత్‌రెడ్డి, పాటల సీడీని ఆవిష్కరిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



వైఎస్సార్ సీపీతోనే గ్రామాల అభివృద్ధి



అగరాలలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

చంద్రగిరి: వైఎస్సార్ సీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం అగరాల, దళితవాడ, కుప్పిరెడ్డిపాళ్యం, బండకాడపల్లి, అరుంధతీ వాడ, దళితవాడ గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డి ఆధ్వర్యంలో అడుగడుగునా పూల వర్షం కురిపించి ఘనంగా సత్కరించారు. సీఎం జగనన్న, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆశీస్సులతో తమ గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని, వారిని జీవితాంతం మరిచిపోమని తెలిపారు. జగనన్న సంక్షేమ పథకాలతో తాము లక్షాధికారులమయ్యామని, చెవిరెడ్డి కుటుంబం ప్రతి కుటుంబాన్నీ ఆదుకుందని వివరించారు. హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగనన్న నెరవేర్చారని, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనేక పనులు చేపట్టారని తెలిపారు. చేసిన మేలును గుర్తించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

అగరాల అభివృద్ధికి రూ.9 కోట్లు

అగరాల పంచాయతీని రూ.9 కోట్లతో అభివృద్ధి చేశామని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి వెల్లడించారు. సీసీ రోడ్లు, సచివాలయ భవనం, జగనన్న సమావేశ మందిరం, రచ్చబండలు, ఆర్బీకే, హెల్త్ క్లినిక్, ధ్యాన మందిరం, చంద్రగిరి కోట నుంచి గ్రామంలోకి తారు రోడ్డు నిర్మించామన్నారు. గ్రామంలో కోల్డ్ స్టోరేజ్ భవనం నిర్మించేందుకు రూ.75 లక్షలు మంజూరు చేశామన్నారు. ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మస్తాన్, డివిజన్ అధ్యక్షులు అగరాల దేవారెడ్డి, పసల నాగరాజు, పంచాయతీ కన్వీనర్ చిరంజీవి రెడ్డి, మాజీ సర్పంచ్ ఉమర్ సాహెబ్, పురుషోత్తం రెడ్డి, అక్బర్, బాలకృష్ణ, సుశీల, మహ్మద్ సాహీర్, ఉస్మాన్, నాగేశ్వరరావు రెడ్డి, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమ జాబితా అందజేస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు

ఘనంగా ధ్వజారోహణం

తిరుపతి మంగళం: జీవకోనలో వెలసిన జీవలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆలయ ధర్మకర్త సురేంద్రరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. గురువారం గణపతి, నవగ్రహ, రుద్ర హోమం, పూర్ణాహుతి, శుక్రవారం శివరాత్రి పండుగ రోజున పార్వతీ సమేత జీవలింగేశ్వరస్వామికి పంచామృత అభిషేకం, శివకోటి నామార్చన, హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలు, 9న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, స్వామివారికి అన్నాభిషేకం, అన్నదానం, లింగోద్భవకాల అభిషేకం, 10న శాంతి అభిషేకం, త్రిశూల స్నానం, ధ్వజావరోహణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సురేంద్రరెడ్డి తెలిపారు.

పీవోఎస్ యంత్రంతో అన్నప్రసాదం టోకెన్ల జారీ



టోకెన్ల జారీని ప్రారంభిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

తిరుపతి(అలిపిరి): తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం అన్నప్రసాద వితరణ కోసం పీవోఎస్ యంత్రంతో టోకెన్ల జారీని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ప్రారంభించారు. టీటీడీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఈ యంత్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలోఎఫ్ఏసీఏవో బాలాజీ, ఐటీ జీఎం ఎల్ఎం సందీప్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి



గ్రామస్తులకు సంక్షేమ పథకాల కరపత్రిక అందజేస్తున్న చెవిరెడ్డి ధ్యానేష్ రెడ్డి

రామచంద్రాపురం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోదరుడు చెవిరెడ్డి ధ్యానేష్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం సూరావారిపల్లి, తిమ్మరాజుపల్లిలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు ప్రతి గడపలోనూ మహిళలు మంగళ హారతులు పట్టి స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల జాబితాను లబ్ధిదారులకు అందించారు. ఇదే సంక్షేమం మళ్లీ కొనసాగాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, తిరుపతి జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, ఎంపీటీసీ మంజుల సిద్దారెడ్డి, డివిజన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, చిట్టిబాబు నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బీకేరెడ్డి, యశ్వంత్, రామిరెడ్డి, మొగిలిరెడ్డి, కేశవులు రెడ్డి, మురళి పాల్గొన్నారు.

లేపాక్షి ఎంపోరియంలలో బ్యాగుల విక్రయానికి చర్యలు



హస్త కళాకారులతో లేపాక్షి చైర్‌పర్సన్, సిబ్బంది



ప్రింటింగ్ వర్క్‌ను పరిశీలిస్తున్న విజయలక్ష్మి

పాకాల: ఈ–పాలగుట్టపల్లిలో హస్తకళాకారులు తయారుచేస్తున్న గుడ్డ బ్యాగులను దేశ వ్యాప్తంగా ఉన్న లేపాక్షి ఎంపోరియంల ద్వారా విక్రయించుకోవడానికి అవకాశం కల్పిస్తామని ఏపీ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి తెలిపారు. ఆమె గురువారం ఈ–పాలగుట్టపల్లికి చేరుకుని గుడ్డ బ్యాగులను తయారు చేసి దేశ విదేశాలకు ఎగుమతి చేస్తున్న మహిళలను అభినందించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హస్త కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. సరైన సౌకర్యాలు లేకపోయినా నిరాశ చెందకుండా గుడ్డ బ్యాగులను తయారు చేసి పర్యావరణాన్ని కాపాడుతున్నారని కొనియాడారు. కళాకారులు మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా ముద్ర, ఎంఎస్ఎంఈ రుణాలు, డీసీహెచ్ గుర్తింపు కార్డులు ఇప్పించాలని. సీఎఫ్‌సీ సెంటర్‌ని ఏర్పాటు చేయించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి శ్రీనివాసం లేపాక్షి మేనేజర్ చలమత్తూరు రవి, సిబ్బంది శ్రీధర్, వీరాంజనేయులు, రూప, అమర్నాథ్, బాలాజి, అనిత, ప్రమీళ, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారున.

పేదల పక్షాన నిలబడింది వైఎస్సార్‌సీపీనే



ఎమ్మెల్యే సతీమణిని ఆత్మీయంగా స్వాగతిస్తున్న రమణయ్యగారిపల్లి మహిళలు

- పేద విద్యార్థుల కోసం పలు మార్పులు
- వృద్ధులకు ఇంటి వద్దకే పింఛను పంపిణీ
- చిరు వ్యాపారులకు జగనన్న చేదోడు

పాకాల: ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంత మంది నాయకులు రాష్ట్రాన్ని పరిపాలించినా పేదల పక్షాన నిలబడింది మాత్రం వైఎస్సార్‌సీపీ మాత్రమేనని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పేర్కొన్నారు. ఆమె బుధవారం రమణయ్యగారిపల్లి పంచాయతీ ఒల్లూరువారిపల్లి, రమణయ్యగారిపల్లి, రమణయ్యగారిపల్లి దళితవాడ, రౌనక్ నగర్ గ్రామాల్లో గడప గడపకూ మహాపాద యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో అపూర్వ స్వాగతం పలికారు. ఆమె ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, ప్రతి ఇంటికీ అందిన సంక్షేమాన్ని వివరించారు. గతంలో ఉన్న ప్రభుత్వాలు ఎన్ని హామీలు ఇచ్చినా వాటిని నెరవేర్చిన పాపాన పోలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలను మోసంచేసేందుకు ప్రయత్నిస్తుంటారని తెలిపారు. ఇలాంటి నక్కజిత్తులను గమనించిన ప్రజలు గత ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టారని గుర్తు చేశారు. జగనన్న ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి ఆంగ్లవిద్యను అందజేస్తున్నారని పేర్కొన్నారు. రూ.కోట్లు వెచ్చించి మెరుగైన వసతులు కల్పించారని వివరించారు. తద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని కొనియాడారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితరులకు ఇంటి వద్దే పింఛను ఇస్తున్నారని తెలిపారు. జగనన్న చేదోడు కార్యక్రమంలో భాగంగా క్షురకులకు, టైలర్లకు, ఆటో డ్రైవర్లకు ప్రతి ఏటా రూ.10 వేలు ఉచితంగా అందజేసి ఆదుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి ఎన్నో పథకాల ద్వారా జగనన్న పేద ప్రజల హృదయాల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. అలాంటి ప్రభుత్వానికి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే సేవలు అభినందనీయం

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. కరోనా సమయంలో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో మందులు, మాత్రలు, కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, విటమిన్ మాత్రలు, శానిటైజర్లు అందించారని గుర్తు చేశారు. ప్రతి ఇంటిలో తానూ ఒక బిడ్డనని గుర్తు చేస్తూ నియోజవర్గంలో నూతన వధూవరులకు పెళ్లి కానుక, రంజాన్ తోఫా, సంక్రాంతి కానుకలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని ఆశీర్వదించి అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లివేడు విక్రమ్‌రెడ్డి, స్టేట్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రఘుపతి, స్టేట్ దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ చోటిమాబి, పొలిటికల్ ఇన్‌చార్జ్ పులికేశవమూర్తిరెడ్డి, ఖాజామస్తాన్, మదార్‌సాయిబు, ఎంపీటీసీ గౌతమి, డివిజన్ అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, సర్పంచులు యువరాజు, ప్రత్యూష్‌రెడ్డి, కళావతి, ఖాదర్‌బాషా, అమర్‌నాథ్‌రెడ్డి, నర్సారెడ్డి, ఇమ్రాన్ బాయ్, రమేష్, ప్రకాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పరాసరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లికానుక అందజేత



ప్రవీణ్‌కు పెళ్లికానుక అందజేస్తున్న నాయకులు

రామచంద్రాపురం: మండలంలోని రావిళ్లవారిపల్లి పంచాయతీ పారకాల్వలో త్వరలో వివాహం చేసుకోనున్న వరుడు ప్రవీణ్‌కు పీహెచ్‌సీ చైర్మన్ మహీంద్రారెడ్డి, ఎంపీటీసీ రాజేష్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, సుధాకర్ నాయుడు, కోటి యాదవ్, పవన్‌కుమార్ బుధవారం పెళ్లికానుక అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తమ సొంత నిధులతో చంద్రగిరి నియోజకవర్గంలో వివాహం చేసుకోబోతున్న వధూవరులకు పట్టు వస్త్రాలు, బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, పసుపు కుంకుమ, పెళ్లికుమార్తెకు గాజులు, గ్రీటింగ్ కార్డు, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందిస్తున్నట్లు తెలిపారు.

బరితెగింపుపై మఠం అధికారుల ఉక్కుపాదం





హథీరాంజీ మఠం భూముల్లో ఆక్రమణలను కూల్చివేసిన అధికారులు, బాధితులతో మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- తుమ్మలగుంట మఠం భూముల్లో ఆక్రమణల తొలగింపు
- ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు
- ఏవో రమేష్‌నాయుడు

తిరుపతి రూరల్: కోట్ల విలువైన హథీరాంజీ మఠం భూముల్లో బరితెగిస్తున్న భూకబ్జారాయుళ్లపై అధికారులు ఉక్కుపాదం మోపారు. నోటీసులు ఇచ్చినా పట్టించుకోకుండా తుమ్మలగుంటలోని మఠం భూముల్లో యథేచ్ఛగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను బుధవారం తెల్లవారుజామున మఠం పరిపాలనాధికారి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, మఠం అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించారు. దాదాపు 30కు పైగా అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. అక్రమ నిర్మాణాల తొలగింపును అడ్డుకునేందుకు కబ్జారాయుళ్లు ప్రయత్నించారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది.

పేదల పక్షాన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తుండటంతో స్థానికులు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వద్దకు వెళ్లి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఆయన హుటాహుటిన అక్కడకు చేరుకుని తొలగింపు పనులను అడ్డుకున్నారు. నిరుపేదలు నష్టపోతారని, కట్టడాల తొలగింపును ఆపివేయాలని మఠం, రెవెన్యూ అధికారులకు విన్నవించారు. తొలగింపు పనులు చేస్తున్న జేసీబీలకు అడ్డుగా నిలబడ్డారు. చీకటిలో తొలగింపు పనులు చేపట్టడం ఏమిటని అధికారులను నిలదీశారు. ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ అర్ధరాత్రి సమయంలో నిర్మాణ పనులు చేపడుతున్నారని, అందువల్లే తొలగింపు పనులు చీకట్లో చేయాల్సి వచ్చిందని మఠం అధికారులు స్పష్టం చేశారు. పేదలు కట్టిన కట్టడాల తొలగింపుకు మోహిత్ రెడ్డి గట్టిగా అడ్డుతగలడంతో అధికారులు వెనుదిరిగారు.

ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు

పేరూరు, తుమ్మలగుంట రెవెన్యూ పరిధిలో 130 ఎకరాల హథీరాంజీ మఠం భూములు ఉన్నాయని మఠం పరిపాలనాధికారి రమేష్‌నాయుడు తెలిపారు. ఆయన బుధవారం తుమ్మలగుంటలో విలేకరులతో మాట్లాడారు. కొందరు భూకబ్జారాయుళ్లు అక్రమంగా మఠం భూములను పేదలకు విక్రయించి, అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. మఠం భూములను విక్రయిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. దేవుని సేవ కోసం వినియోగించాల్సిన ఈ భూములను అమాయకులు ఎవ్వరూ కొని మోసపోవద్దని, అక్రమ నిర్మాణాలు అన్నింటినీ తొలగిస్తామని హెచ్చరించారు.